క్లుప్తంగా

రేషన్ బియ్యం అమ్మితే కఠిన చర్యలు

నింద్ర: మండలంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం బయట వ్యక్తులకు అమ్మితే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ అమరేంద్ర బాబు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులు సక్రమంగా తీసుకోవడం లేదని, మండలంలో ప్రతి నెల 80 శాతం మాత్రమే పంపిణీ జరుగుతోందన్నారు. వాటిని కూడా ఇతర ప్రాంతాల వారికి విక్రయించడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారులు తీసుకున్న బియ్యాన్ని బయట విక్రయించే వారిపై చర్యలు తీసుకుని రేషన్‌కార్డులు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

విద్యాసామగ్రి వితరణ



అంగన్‌వాడీ విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న జయసాయికృష్ణ

కార్వేటినగరం: మండల పరిధిలోని కేఎంపురం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అదే గ్రామానికి చెందిన రాణి, మురగయ్య దంపతుల కుమారుడు పీఎం జయసాయికృష్ణ జన్మదినం సందర్భంగా గురువారం విద్యాసామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ రాణెమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు దాతలు విద్యాసామగ్రి అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్, ఆశావర్కర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో అధికారులు అప్రమత్తం

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో చిరుత సంచరిస్తోందన్న ప్రచారం నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం వర్సిటీ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ హాస్టల్ గ్రౌండ్ సమీపంలో చిరుత కాలి ముద్రలు ఉన్నాయని విద్యార్థులు చూపిన చిత్రాలు శునకాలవని అటవీశాఖ అధికారులు తేల్చడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్రమంలో సాయంత్రం 6 గంటలపైన గ్రౌండ్లు, జనసంచారం లేని ప్రాంతాలు, అటవీ ప్రాంతం అంచున వున్న రోడ్లపైన తిరగరాదని విద్యార్థులను ఆదేశించారు.

మహిళా వర్సిటీలో స్మార్ట్ స్కిల్స్‌పై శిక్షణా శిబిరం

తిరుపతి సిటీ: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇంటర్నేషనల్ రిలేషన్స్ సెంటర్, ఏషియా పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఐసీటీ, బంగ్లాదేశ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ వారి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వర్సిటీలోని సావేరీ సెమినార్ హాల్‌లో స్మార్ట్ స్కిల్స్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ డి.భారతి మాట్లాడుతూ మహిళా విశ్వవిద్యాలయంలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఆరు ఇంక్యుబేషన్ సెంటర్స్ ఉన్నాయన్నారు. పరస్పర సహకారంతో కృషి చేసి అనేకమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నామని తెలిపారు. వారిని ప్రోత్సహించేందుకు లేటెస్ట్ టెక్నాలజీస్, డిజిటల్ మార్కెటింగ్, బ్రాండింగ్, స్టోరీ టెల్లింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే విధానాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తారని చెప్పారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిదేందుకు మహిళా వర్సిటీ, బీఐడీ సంస్థలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని శిక్షణకు హాజరైన వ్యక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ శిబిరానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజిని, మాజీ వీసీ దుర్గాభవానీ, ఏషియా పసిఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఐసీటీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ కియాంగ్ కో, బంగ్లాదేశ్ సంస్థకు చెందిన సాహిద్ ఉద్దీన్ అక్బర్, నేషనల్ కన్సల్టెంట్ ఆన్ ఐసీటీ ఫర్ డెవలప్‌మెంట్ ప్రొఫెసర్ ఉష వ్యాసులు రెడ్డి, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి త్యాగరాజ సంగీతోత్సవాలు

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలోని సమావేశ మందిరంలో శుక్రవారం నుంచి 22వ తేదీ వరకు త్యాగరాజ సంగీతోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు త్యాగరాజ ఉత్సవ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మోహన్ సుందరం తెలిపారు. ఆయన త్యాగజరాజ మండపంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సంగీతోత్సవాలు నిర్వహిస్తూ త్యాగరాజ స్వామి సంగీత వైభవాన్ని చాటుతున్నామని తెలిపారు. ఈ ఏడాది ఐదు రోజులు ఉత్సవాలు చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ టీఎస్.క్రిష్ణమూర్తి ఉత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం మంత్రి మేరుగు నాగార్జున, సినీ నటుడు మంచు విష్ణు, మలయాళ సినీ నటుడు ఉన్నికృష్ణన్ ముకుంద నాయర్, అడిషనల్ డీజీ శశిధర్ రెడ్డి దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా ఉన్నికృష్ణన్ ముకుందన్ నాయర్ తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పాలన అందిస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం మండల పరిధిలోని పులికల్లు, తాటిమాకులపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను వివరించి రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి ఓటు వేసి జగనన్నను ఆదరించాలన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని కొనియాడారు. పేదలకు అందని ద్రాక్షలా మారిని ఉన్నత చదువులకు అమ్మఒడి, విద్యాదీవెన, విదేశీ విద్యాదీవెన వంటి పథకాలతో పేదల విద్యకు బాసటగా నిలిచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమన్నారు. అదేవిధంగా వైఎస్సార్ ఆసరా, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ, పథకాలతో ప్రతి నెలా క్యాలెండర్ వారీగా సంక్షేమాలు అందిస్తూ మహిళలకు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. అధికారం కోసం గ్రామాల్లో, కులాల మధ్య చిచ్చులు పెట్టేందుకు చూస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాటలను నమ్మవద్దని పిలుపునిచ్చారు. సంక్షేమ సారథిని ఆదరించి మరో 30 ఏళ్ల వరకు జగనన్నను ముఖ్యమంత్రిని చేసి అనేక సంక్షేమాలు అందుకోవాలన్నారు.

మౌలిక వసతులు కల్పించండి..

అనంతరం పలువురు మహిళలు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమ పథకాలు అందుకోలేదని, జగనన్న అధికారం వచ్చాక తమకు పథకాల ద్వారా రూ.లక్షల మేర లబ్ధి పొందుతున్నామని, తాము ఎల్లప్పుడూ జగనన్న వైపే ఉంటామని తెలిపారు. ఆలాగే గ్రామంలో మౌలిక వసతులు కొరవడ్డాయని మంత్రి నారాయణస్వామి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే సమస్యలను పరిష్కరించి తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు యశోదా రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు మీనా, ఎంపీటీసీ జమున, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, నాయకులు కృష్ణారెడ్డి, పండరీనాథ్, దాము, నవీన్‌కుమార్‌రెడ్డి, మహేష్, ఏఎంసీ డైరెక్టర్ రవిమనోహర్, హేమాద్రినాయుడు పాల్గొన్నారు.

కామధేనువుపై విహరించిన శ్రీకృష్ణుడు



అమ్మగారి ఇంటికి ఊరేగింపుగా పయనమైన ద్రౌపదీదేవి



కామధేనువుపై విహరిస్తున్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడు

- అమ్మగారి ఇంటికి వెళ్లిన ద్రౌపదీదేవి
- సారె సమర్పించిన చౌటూరు గ్రామస్తులు

పుత్తూరు రూరల్: శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టుపీతాంబరాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ద్రౌపదీదేవి జన్మస్థలమైన చౌటూరు గ్రామానికి ఊరేగింపుగా వెళ్లారు. వన్నియ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారిని భక్తిప్రపత్తులతో పూజించి, సారెను సమర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం యాదవ సంఘ ఆధ్వర్యంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణభగవానుడు కామధేనువుపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ లారీమోహన్, కమిటీ సభ్యులు ముకుందప్రకాష్, సెల్వరాజ పిళ్లై, మునిరాజ, లక్ష్మీసుధ, నిర్మల, మహాదేవి, మోహన్ పర్యవేక్షించారు.

రసాయనాల కంటే కషాయాలు వేలు



ద్రవజీవామృతం కషాయం తయారీపై రైతులకు వివరిస్తున్న డీపీఎం వాసు

పాలసముద్రం : వ్యవసాయంలో రసాయనాల కంటే కషాయాలు ఎంతో మేలని ఏపీపీఎస్‌ఎఫ్ డీపీఎం వాసు తెలిపారు. గురువారం శ్రీకావేరిరాజుపురంలో పంచాయతీ కార్యదర్శి యశ్వంత్, సర్పంచ్ గాలి మహేష్‌బాబు సమక్షంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఎదుట ద్రవజీవామృతం తయారు చేశారు. డీపీఎం వాసు మాట్లాడుతూ ద్రవజీవామృతం తయారు చేసేందుకు 2 కిలోల శనగపిండి, 2 కిలోల బెల్లం, 10 కేజీల ఆవు పేడ, 10 లీటర్ల ఆవు మూత్రం, 20 లీటర్ల నీరు డ్రమ్ములో వేసి కలియబెట్టాలని తెలిపారు. ఈ విధంగా తయారు చేసిన కషాయన్ని వరి, కూరగాయల పంటలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం అవలంభించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

సీఆర్‌పీకి ఘన సన్మానం



మనోహర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం: మండలంలోని ఆర్‌కేఎం పురం క్లస్టర్ రీసోర్సు పర్సన్‌గా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన మనోహర్‌వర్మను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సీఆర్పీ మనోహర్ వెదురుకుప్పం మండలంలో పని చేస్తూ రామచంద్రాపురం మండలానికి బదిలీ అయ్యారు. కాగా గురువారం మాంబేడు పాఠశాలలో మనోహర్‌కు సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మనోహర్ సేవలను కొనియాడారు. ఈసందర్భంగా పూలమాల వేసి దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు.

హిందీ భాషపై తర్ఫీదు ఇవ్వాలి



డీఈఓను సన్మానిస్తున్న హిందీ టీచర్స్ యూనియన్ సభ్యులు

నగరి : హిందీ భాషలో విద్యార్థులకు బాగా తర్ఫీదు ఇవ్వాలని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో డీఈఓను హిందీ టీచర్స్ యూనియన్ నాయకులు కలిశారు. ఆయనను దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారితో డీఈఓ మాట్లాడుతూ హిందీ జాతీయ భాష గనుక విద్యార్థులు ప్రావీణ్యత సాధించేలా బోధించాలన్నారు. నాణ్యతతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, సీజెడ్‌ఎల్ జయానందం, లీలాషాలిని, అరుణ, పద్మజ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరుల అభివృద్ధిపై సమీక్ష



ఉమ్మడి వనరులపై మాట్లాడుతున్న ఏఓ విద్యావతి

పాలసముద్రం : మండలం పరిధిలోని ఉమ్మడి వనరులను అభివృద్ధి చేయడానికి అందరూ కృషి చేయాలని మండల పరిపాలన అధికారి ఎస్.విద్యావతి తెలిపారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. మండల పరిధిలోని కాలువలు, వంకలు, ప్రభుత్వ భూములు, గుట్టలను అభివృద్ధి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు చెట్లు నాటాలని తెలిపారు. పంచాయతీల్లో ప్రభుత్వం భూములను గుర్తించి వాటిలో ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల చెట్లు పెట్టి పంచాయతీలకు ఆదాయం వనకూరేటట్లు సహకరించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, జేఈ అనూష పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిస్తున్న దాతలు

కార్వేటినగరం: విద్యార్థులకు సాయం అందించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని మండల పరిధిలోని గాజంకి దళితవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రూప అన్నారు. గురువారం పాఠశాలలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఎం.భాస్కర్, శశి దంపతుల కుమారుడు సాత్విక్ పుట్టిన రోజు సందర్భంగా రూ.7 వేల విలువైన విద్యాసామగ్రితో పాటు పాఠశాలకు ఆడియో మైక్‌సెట్‌ను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసీ ఛైర్మన్ దాతలను అభినందించారు.

ఈ-క్రాప్ బుకింగ్ పరిశీలన



ఈ-క్రాప్ బుకింగ్ నమోదును పరిశీలిస్తున్న ఏఈఓ డిల్లీప్రసాద్

పాలసముద్రం : మండల పరిధిలోని రైతులు రబీ సీజన్ పంటలు ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేయించుకుంటేనే రైతులు అన్నిరకాల ప్రభుత్వ పథకాలకు అర్హులవుతారని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన ఆముదాల, బాలకృష్ణాపురంలో ఈ-క్రాప్ బుకింగ్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకుంటేనే క్రాప్ ఇన్సూరెన్సు రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, రైతుభరోసా, పంటనష్ట పరిహారం, సున్నావడ్డీ రుణాలు, పీఎం కిసాన్ తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం వర్తించాలంటే ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్ఓ, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ



రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందిస్తున్న బాబురెడ్డి

గంగాధరనెల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆర్బీకే మండల అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ బాబురెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అంబోధరపల్లి గ్రామ సచివాలయంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో రైతులకు సంక్షేమ పథకాలే కాకుండా పట్టాదారు పాసుపుస్తకాలను అందించి రైతన్నల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతున్నారని గుర్తు చేశారు. అనంతరం అర్హులైన వారికి పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు లోకనాథరెడ్డి, వీఆర్ఓ హరి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శరవేగంగా 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు



శరవేగంగా జరుగుతున్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు

కార్వేటినగరం: జిల్లాకే తలమానికంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నిలుపుతున్నారు. నియోజకవర్గంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం మోల్డింగ్ పనులను ప్రారంభించారు. జీడీనెల్లూరు నియోజకవర్గానికి రాష్ట్రంలో గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులకు మంత్రి నారాయణస్వామి శ్రీకారం చుడుతున్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఈ నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 30 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధి చేసి చూపుతున్నారు. కార్వేటినగరం, పెనుమూరు మండలాల్లో సామాజిక ఆరోగ్యకేంద్రాల నిర్మాణానికి రూ.26 కోట్లు వెచ్చించిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కుతుంది. సీహెచ్‌సీ నిర్మాణ పనులు జరుగుతుండగానే, అన్నిరకాల వ్యాధులకు వైద్యం అందించడానికి డాక్టర్లు అందుబాటులోకి వచ్చారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి



డీపీఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి : గ్రామాల్లో పనిచేసే క్లాత్ మిత్రులకు, గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మికి వినతిపత్రం అందించారు. గురువారం నగరి పట్టణానికి విచ్చేసిన ఆమెను కలిసిన ఏఐటీయూసీ నాయకులు పంచాయతీ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులైన క్లాత్ మిత్రలకు, గ్రీన్ అంబాసిడర్లకు వేతన బకాయిలను చెల్లించాలని కోరారు. జీతాలు చెల్లించలేని పక్షంలో ఉపాధిహామీ పథకం కింద వీరిని కూడా జత చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, గ్రీన్ అంబాసిడర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రన్, జిల్లా ఉపాధ్యక్షుడు యేసుపాదం, దేశప్ప, సహాయ కార్యదర్శి రవి, గిరి, ఏలుమలై, నగరి మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, రవి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కేంద్రబృందం పర్యటన



శ్రీహరిపురంలో స్కూల్‌ను పరిశీలిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్రబృందం సభ్యులు

విజయపురం (నగరి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కేంద్ర బృందం గురువారం మండలంలో పర్యటించింది. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ అధికారి రామ్మోహన్ తన బృందంతో శ్రీహరిపురం గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా 15 కుటుంబాలను సందర్శించి మరుగుదొడ్ల వాడకంపై అవగాహన కల్పించారు. అలాగే పంచాయతీలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, ఆర్‌బీకే, హైస్కూల్, అంగన్‌వాడీ భవనం, హెల్త్ సెంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బహిర్గత ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన మంచిది కాదన్నారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వాడకం అలవాటు చేసుకోవాలన్నారు. కొందరు ఇంటిలో మరుగుదొడ్డి ఉన్నా, బహిరంగ ప్రదేశాలకు వెళ్లడం సరికాదన్నారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యం, మరుగుదొడ్డి వాడకం, గ్రామాభివృద్ధిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బాబు, సర్పంచ్ జ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయండి

- సచివాలయ కన్వీనర్లకు బీమా భరోసా
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి




సచివాలయ కన్వీనర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: గంగాధరనెల్లూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేసి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. మండలం కేంద్రంలోని ఎస్ఎల్వీ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి సచివాలయం కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు సచివాలయ కన్వీనర్లకు రూ.10 లక్షల జీవిత బీమాకు ముఖ్యమంత్రి జగనన్న శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతిఒక్కరూ రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోటీ చేసినట్లు, ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. విపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టి, సచివాలయం కన్వీనర్లు మీ పరిధిలో గల గ్రామాల్లో ఉన్న నాయకులను, కార్యకర్తలు, గృహసారథులను కలుపుకుని ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. ప్రతి కన్వీనర్ జేసీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, తమ పరిధిలో ఉన్న గృహసారథులను, కార్యకర్తలను చేర్చుకుని ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించాలన్నారు. పార్టీలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు.

పార్టీ వ్యతిరేక పాల్పడడం దారుణం..

అనంతరం నియోజకవర్గ బూత్ కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ కొంతమంది నాయకులు సొంతపార్టీలో పదవులు అనుభవిస్తూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం దారుణమని ఆరోపించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో అమాయకులను రెచ్చగొట్టి అడ్డుకుని, ప్రభుత్వాన్ని కార్యక్రమాన్ని అవమానించడం మంచి పద్ధతి కాదన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, అన్నివర్గాల వారు జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆశీర్వదిస్తున్నారని తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో నియోజకవర్గ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి రెడ్లను అవమానిస్తున్నారని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అదంతా అవాస్తమన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని వర్గాలు కలిసికట్టుగా పని చేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు హర్షణీయం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జర్నలిస్టుల సేవా కార్యక్రమాలు హర్షణీయమని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అన్నారు. ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని గంగనపల్లి నగర నిరాశ్రయుల కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని ఎస్పీ రిశాంత్‌రెడ్డి, నగర కమిషనర్ అరుణ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జర్నలిస్టులు సామాన్యుల గొంతును వినిపించాలని సూచించారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై పోలీసు శాఖ నుంచి ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. తన దృష్టికి రాని సమస్యలేవైనా ఉంటే తనను కలిసి తెలియజేయవచ్చన్నారు. సంచలనాలకు కాస్త దూరంగా ఉంటూ వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. నగర కమిషనర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలు గొప్పవన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు లోకనాథన్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ పలు సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో రేణుకకు వినతిపత్రం అందజేశారు.

భక్తులకు రక్షణగా..



అలిపిరి నడక మార్గంలో చిరుత దాడిలో బాలిక మృతిచెందిన సంఘటనతో టీటీడీ యాజమాన్యం భక్తుల రక్షణకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భక్తులను గుంపులుగా సెక్యూరిటీ సిబ్బందిని తోడు చేసి తిరుమలకు పంపుతోంది. ఈ క్రమంలో సెక్యూరిటీ సిబ్బంది కర్రలు చేతపట్టుకుని గురువారం భక్తులకు రక్షణగా ముందుకుసాగారు. భక్తులు గోవింద నామస్మరణతో తిరుమలకు నడక సాగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి